క్లుప్తంగా

విద్యుత్‌కు అంతరాయం


తీగలపై పడిన కొమ్మలు

మునిపల్లి(అందోల్): మండలంలోని మక్తక్యాసారం శివారులో విద్యుత్ తీగలపై చెట్లకొమ్మలు పడడంతో తీగలు తెగిపోయాయి. సోమవారం సంబంధిత అధికారులు, సిబ్బంది వాటిని సరిచేశారు. విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వకుండా చెట్లు కొట్టడంతో తీగలపై కొమ్మలు పడ్డాయని విద్యుత్ ఏఈ ప్రశాంత్ తెలిపారు. దీని వల్ల తాటిపల్లి, పిల్లోడి, గార్లపల్లి, పెద్దలోడి, మక్తక్యాసారం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని చెప్పారు. విద్యుత్ అధికారులు, సిబ్బందికి సమాచారం ఇచ్చి చెట్లు కొట్టాలని ఆయా గ్రామాల రైతులు, ప్రజలను ఆయన కోరారు.

విశేషాలంకరణలో గణనాథుడు

పటాన్‌చెరు టౌన్: మండలంలోని రుద్రారం గణేష్‌గడ్డ దేవస్థానం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. అనంతరం ఆలయ ఆవరణలో ఉన్న శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ సోమవారం నేపథ్యంలో అన్నపూర్ణ సహిత సిద్ధి గణపతిగా ఆలయ అర్చకులు అలంకరించారు. ఆలయంలో నిత్య అన్నదాన కార్యక్రమం కొనసాగుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

బిల్వార్చన

జహీరాబాద్: కోహీర్ మండలం బడంపేటలో గల రాచన్నస్వామి వారి దేవస్థానంలో శ్రావణ మాస ఉత్సవాలలో భాగంగా సోమవారం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. నాల్గో సందర్భంగా స్వామికి ప్రాతఃకాల రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన చేశారు. సత్యనారాయణ వ్రతం, ఉమా మహేశ్వర వ్రతను దంపతులు ఆచరించారు. అన్నదానం గావించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఉత్సవ విగ్రహాల వద్ద భక్తులు బిల్వార్చన, కుంకుమార్చనలు చేశారు.

నగర సంకీర్తన బృందం భజన కార్యక్రమాలు


భజనలు నిర్వహిస్తున్న భక్తులు

జహీరాబాద్: పట్టణంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ నగర సంకీర్తన బృందం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి భజన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. భజనలు చేస్తూ పట్టణంలో పాదయాత్రగా పద్మశాలి భవన్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా తులసి హారతి, గురు వందనం, హరినామ సంకీర్తన, మంగళ హారతి, ఆధ్యాత్మిక సందేశం కార్యక్రమాలు జరిపారు.

భద్రకాళి, వీరభద్రేశ్వరులకు ప్రత్యేక పూజలు

రాయికోడ్(అందోల్): స్థానిక భద్రకాళి సమేత వీరభద్రేశ్వరులకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ సోమవారం సందర్భంగా అర్చకులు అభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించారు. పలువురు ప్రభుత్వ అధికారులు, నాయకులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేయడంతో ఆలయ పరిసరాలు రద్దీగా మారాయి. కార్యక్రమంలో ఈఓ శివరుద్రప్ప, సిబ్బంది కృష్ణ, అర్చకులు వీరయ్య, బస్వరాజ్, శివకుమార్, రుద్రయ్య స్వాములు పాల్గొన్నారు.

ఆశాజనకంగా పత్తి పంట

రాయికోడ్(అందోల్): మండలంలో రైతులు సాగుచేస్తున్న పంట ఆశాజనకంగా ఎదుగుతోంది. ఈ సీజన్‌లో సుమారు 35వేల ఎకరాల్లో పత్తి సాగవుతోంది. వాతావరణం పత్తి పంటకు అనుకూలంగా ఉండటంతో మొక్కలు ఏపుగా పెరిగాయి. ప్రస్తుతం కాత, పూత దశలో ఉంది. చీడపీడల నివారణకు రైతులు రసాయనాలను పిచికారీ చేయడంలో నిమగ్నమయ్యారు. మరో రెండు నెలల్లో పంట చేతికందుతుంది. అప్పటి వరకు వాతావరణం అనుకూలంగా ఉంటే ఎకరాకు 15క్వింటాళ్ల దిగుబడి వచ్చే సూచనలు ఉన్నాయని పలువురు సాగు రైతులు తెలిపారు.

ఎండు గంజాయి పట్టివేత

మునిపల్లి(అందోల్): 65వ నంబర్ జాతీయ రహదారి కంకోల్ టోల్‌ప్లాజా సమీపంలో 78 కిలోల ఎండు గంజాయిని పట్టుకున్నట్లు మెదక్ డివిజన్ ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రావు తెలిపారు. సోమవారం మండలంలోని కంకోల్ టోల్ ప్లాజా సమీపంలో తనిఖీలు నిర్వహిస్తుండగా ఆంధ్రప్రదేశ్‌లోని తూచి నుంచి మహారాష్ట్రలోని నాసిక్‌కు టాటా సఫారీ వాహనంలో తరలిస్తున్న 78 కిలోల గంజాయిని పట్టుకున్నారు. వాహనం స్వాధీనం చేసుకుని వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ గాంధీ నాయక్, కానిస్టేబుల్ అలీం పాల్గొన్నారు.


నారాయణఖేడ్‌లో..


న్యాల్‌కల్‌లోని మల్లన్న స్వామి ఆలయంలో..


నారాయణఖేడ్: కృష్ణ మందిరంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి దంపతులు

గోపాల.. గోపాల

శ్రీకృష్ణాష్టమి వేడుకలు జిల్లాలో ఘనంగా కొనసాగాయి. సిద్దిపేట కేంద్రంలోని సుందర సత్సంగంతో పాటుగా అన్ని ఆలయాలలో ఉదయం నుంచే కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుడి ఆలయాలలో విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులు కృష్ణుడు, యశోద, గోపికల వేషధారణలో అందరినీ అలరించారు. ఆలయాల వద్ద చిన్నారులు నృత్యాలు, కోలాటాలు చేశారు. ఆలయాల నిర్వహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.


మునిపల్లి(అందోల్):ఉట్టి కొడుతున్న చిన్నారులు


పటాన్‌చెరు టౌన్:ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి..


పటాన్‌చెరుటౌన్‌లో.. కాంగ్రెస్ నేత నీలం మధు


రామచంద్రాపురం(పటాన్‌చెరు)లో..


ఝరాసంగంలో..


ఝరాసంగంలో..


జహీరాబాద్‌లో..



జహీరాబాద్: గొల్లకురుమ సంఘం ఆధ్వర్యంలో..


సంగారెడ్డిజోన్‌లో..


సంగీత విద్యాలయంలో..


హత్నూరలో..


పుల్‌కల్‌లో..


కందిలో..


సంగారెడ్డి టౌన్‌లో..


సదాశివపేటలో..


పటాన్‌చెరు: గోపికల వేషధారణలో చిన్నారులు


న్యాల్‌కల్‌లో..

మదర్‌థెరిస్సాకు నివాళి


మదర్‌థెరిస్సాకు నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మానవతా వాది.. పేదల పెన్నిధి మదర్‌థెరిస్సా 114వ జయంతి పురస్కరించుకుని ఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు సమర్పించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు అబ్రహం మాదిగ, దండు జయరాజ్, కిట్టు, ప్రేమ్‌రాజ్, శ్యాం సుందర్, మోహన్, అజయ్ పాల్గొన్నారు. **–జహీరాబాద్ టౌన్:**

గార్డెన్ దొర సేవలు ప్రశంసనీయం

● ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ ప్రాంతంలో విద్యాభివృద్ధికి గార్డెన్ దొర ఎంతగానో కృషి చేశారని ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు కొనియాడారు. గార్డెన్ దొర 32వ వర్ధంతి సందర్భంగా సోమవారం ఎంఆర్‌హెచ్‌ఎస్ స్కూల్ ఆవరణలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ సంఘ నాయకులు,అధికారులు,బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.


గార్డెన్ దొర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

అభివృద్ధికి ఆద్యుడు కొర్వి కృష్ణ

పటాన్‌చెరు: హైదరాబాద్ నగర తొలి మేయర్, ముదిరాజ్ మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ హైదరాబాద్ మహానగర అభివృద్ధికి ఆద్యుడు అని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ కొనియాడారు. కొర్వి కృష్ణస్వామి జయంతిని పురస్కరించుకొని సోమవారం చిట్కుల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మత్స్యశాఖ జిల్లా డైరెక్టర్ శీను, నారాయణరెడ్డి, పొట్టి నారాయణరెడ్డి, వెంకటేశ్, గోపాల్, శ్రీనివాస్, రాము పాల్గొన్నారు.

సంగారెడ్డి : పట్టణంలోని స్థానిక ముదిరాజ్ సంఘంలో కొర్వికృష్ణ స్వామి 131వ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలను వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పులిమామిడి రాజు మాట్లాడుతూ.. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం గౌరవ అధ్యక్షుడు చంద్రశేఖర్, మురళీధర్, తిర్మల్ రావ్, జనార్దన్, పిట్టల రమేష్, పాల్గొన్నారు.


కొర్వి కృష్ణస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నీలం మధు ముదిరాజ్

గాలయ్య సేవలు మరవలేనివి

జోగిపేట(అందోల్): మాజీ డీసీసీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ డాకూర్ గాలయ్య 33వ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. గాలయ్య చిత్రపటానికి పలువురు పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీసీసీ అధ్యక్షుడిగా పార్టీకి చేసిన సేవలు మరవలేనివని, జిల్లాలో పార్టీ అభివృద్ధికి ఎంతో కృషిచేశారని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య, వైస్‌చైర్మన్ ప్రవీణ్, కౌన్సిలర్‌లు ఎస్.సురేందర్ గౌడ్, ఆకుల చిట్టిబాబు, సురేశ్, హరికృష్ణ గౌడ్, దుర్గేశ్, చందర్, మాజీ ఎంపీటీసీ డీజీ వెంకటేశ్, కో ఆప్షన్ సభ్యుడు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బీదర్‌లో ఎంపీలకు సన్మానం

నారాయణఖేడ్: కర్ణాటకలోని జిల్లా కేంద్రం బీదర్ పట్టణంలో సోమవారం అక్కడి నాగరిక అభినందన సమితి ఆధ్వర్యంలో సన్మానసభను ఏర్పాటు చేశారు. సభలో జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, బీదర్ ఎంపీ సాగర్ ఖండ్రేలను ఎంపీలుగా గెలిచిన సందర్భంగా బీదర్ జిల్లా భాల్కీలోని హీరేమఠం పీఠాధిపతి గురుబసవపట్టేదేవరు, కర్ణాటక రాష్ట్ర అటవీశాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రే, పురపాలకశాఖ మంత్రి రహీంఖాన్ సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా జహీరాబాద్ ఎంపీ మాట్లాడుతూ.. పరస్పరం సహకరించుకుంటూ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేద్దామని కోరారు.


సన్మానసభలో పాల్గొన్న ఎంపీలు, ప్రముఖులు

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

● పొంచి ఉన్న ప్రమాదం
● భయాందోళనకు గురవుతున్న ప్రజలు

హత్నూర(సంగారెడ్డి): మండల కేంద్రమైన హత్నూరలోని మొదటి వార్డులో విద్యుత్ సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. సీసీ రోడ్డుకు ఆనుకొని కిందికి ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతోందని ఆందోళన చెందుతున్నారు. రోడ్డుకు దూరంగా పైకి బిగించాలని పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దూరంగా పైకి అమర్చాలని ప్రజలు కోరుతున్నారు.


పిచ్చిమొక్కల్లో ట్రాన్స్‌ఫార్మర్

సంక్షిప్త వార్తలు

◆ **గుండెపోటుతో మాజీ సర్పంచ్ మృతి**

పటాన్‌చెరు టౌన్: ఘనపూర్ మాజీ సర్పంచ్ విఠలయ్య (55) సోమవారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందారు. విఠలయ్య 2013 నుంచి 2018 వరకు సర్పంచ్‌గా సేవలందించారు. ఈ మేరకు గ్రామస్తులు, పలువురు నాయకులు సంతాపం తెలిపారు.

◆ **మూడు నెలల సమయం ఇవ్వండి**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): రూ.రెండు లక్షల పైన రుణాలు తీసుకున్న రైతులు చెల్లించేందుకు మూడు నెలల సమయం ఇవ్వాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రైతులకు పెట్టుబడుల సమయంలో రూ.రెండు లక్షలపైన రుణాన్ని బ్యాంకులకు చెల్లించి రుణమాఫీకి దరఖాస్తు చేసుకోమనడం సరికాదన్నారు. ప్రస్తుతం రైతుల వద్ద డబ్బులు ఉండవని, ప్రభుత్వం చేసే రుణమాఫీ రెండు లక్షలు రైతుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు.

◆ **నివాళి**

నారాయణఖేడ్: ఖేడ్ ముదిరాజ్ యువసేన ఆధ్వర్యంలో సోమవారం కొరివి కృష్ణ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఖేడ్ జంటగ్రామమైన మంగల్‌పేట్‌లోని ఆయన విగ్రహం వద్ద సంఘం నాయకులు సంఘం జెండాను ఆవిష్కరించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముదిరాజ్ సంఘం, ముదిరాజ్ యువసేన జిల్లా, స్థానిక బాధ్యులు సత్యనారాయణ, శంకర్ ముదిరాజ్, కృష్ణ, సాయిలుపటేల్, గుండుమోహన్, శ్రీనివాస్, హన్మాండ్లు, రామకృష్ణ, రామకృష్ణ, విఠల్, పరమేష్, రవి, బాలు, గుణాకర్, శ్రీశైలం, రాములు తదితరులు పాల్గొన్నారు.

◆ **విద్యుత్ కోత**

జహీరాబాద్: పట్టణంలో సోమవారం విద్యుత్ కోత విధించారు. ఉదయం నుంచి రాత్రి 8 గంటల వరకు సరఫరా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మధ్య మధ్యలో కరెంటు వచ్చినా ఐదు నిమిషాల పాటు కూడా ఉండక పోవడంతో వినియోగదారులు అసహనం వ్యక్తం చేశారు. సాంకేతిక కారణాల వల్ల అంతరాయం కలిగినట్లు ట్రాన్స్‌కో సిబ్బంది పేర్కొన్నారు.

◆ **సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ**

నారాయణఖేడ్: పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను ఉమ్మడి మెదక్ జిల్లా ప్రణాళికా సంఘం మాజీ సభ్యులు నగేష్ షెట్కార్ సోమవారం పంపిణీ చేశారు. ఖేడ్ నియోజకవర్గంలోని కడ్పల్ తండాకు చెందిన రాధాబాయికి రూ.18 వేలు, అంతర్‌గాంకు చెందిన అనితకు రూ.17,500, సిర్గాపూర్‌కు చెందిన అబ్దుల్ అజీంకు రూ.45 వేలు మంజూరయ్యాయి. ఈ చెక్కులను ఎంపీ సురేష్ షెట్కార్ నివాసంలో నగేష్ షెట్కార్ లబ్ధిదారులు, వారి కుటుంబీకులకు అందించారు. ఆయాగ్రామాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

◆ **చెక్కుల పంపిణీ**

పుల్‌కల్(అందోల్) : పుల్‌కల్ మండలంలో సోమవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కలను పంపిణీ చేశారు. మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు రూ 22,68,500 చెక్కులను పంపిణీ చేశారు.

◆ **ఖేడ్‌లో రుద్రాభిషేకం**

నారాయణఖేడ్: పట్టణంలోని కాశీవిశ్వేశ్వర ఆలయంలో శ్రావణమాసంలో సోమవారాన్ని పురస్కరించుకొని ఆలయ అర్చకులు గురురాజశర్మ ఆధ్వర్యంలో రుద్రాభిషేకం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనగా, ప్రవాసభారతీయుడు మశ్చందర్ భక్తులకు అన్నవితరణ ఏర్పాటు చేశారు.

◆ **అడ్మిషన్ పేరుతో పైసల్ వసూలు**

పటాన్‌చెరు టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఉచిత, పుస్తకాలు దుస్తులు అందజేయాలని అధికారులు యోచిస్తుంటే.. మరోవైపు పట్టణంలోని బాలుర ప్రభుత్వ పాఠశాలలో దీనికి విరుద్ధంగా జరుగుతోంది. అడ్మిషన్ పేరుతో విద్యార్థి నుంచి రూ.300 వసూలు చేస్తున్నారు. ఈ విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు 'సాక్షి' దృష్టికి తీసుకువచ్చారు. రూ.300 ఎందుకు వసూలు చేస్తున్నారని ప్రశ్నిస్తే పాఠశాల అభివృద్ధి కోసం తీసుకుంటున్నామని ఉపాధ్యాయులు సమాధానం ఇస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు.

◆ **బకాయి డబ్బులు చెల్లించాలి**

నారాయణఖేడ్: బీఎల్‌వోలు, మున్సిపల్ కార్మికులకు బకాయి డబ్బులను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా నాయకులు చిరంజీవి అన్నారు. ఎన్నికలు జరిగి ఐదు నెలలుదాటినా.. డబ్బులు చెల్లించకపోవడం సరికాదన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొన్న అధికారులకు డబ్బులు అప్పట్లోనే చెల్లించి, దిగువస్థాయి సిబ్బందికి చెల్లించకపోవడం దారుణమన్నారు.

◆ **మెట్ల నుంచి పడి కార్మికుడు మృతి**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మెట్ల మీది నుంచి కింద పడి తలకు గాయమై ఓ కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని ఆరూర్ శివారులోని ఎవరెస్ట్ పరిశ్రమలో సోమవారం చోటు చేసుకుంది. సదాశివపేట సీఐ మహేష్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశాకు చెందిన ప్రతాప్ మహకుడ్(36) ఎవరెస్ట్ పరిశ్రమలో కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఫ్యాక్టరీలో మెట్లు దిగుతున్న క్రమంలో ప్రమాదవశాత్తుగా కింద పడిపోయాడు. దీంతో తలకు తీవ్ర గాయమైంది. దీంతో పరిశ్రమ యాజమాన్యం వెంటనే చికిత్స కోసం మొదట సదాశివపేట లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.కాగా మృతుడి కుటుంబానికి రూ 50లక్షల పరిహారం చెల్లించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అనిల్ డిమాండ్ చేశారు.